# నిలిచిన నీరు.. రాకపోకలు బంద్



బైంసా : ట్రాక్టర్‌తో పొలాన్ని చదును చేస్తూ..



తర్నం వద్ద నిర్మించిన వంతెన

## రూ.4.50 కోట్లతో తర్నం వద్ద బ్రిడ్జి నిర్మాణం

- చిన్నపాటి వర్షాలకే నీరు నిలువడంపై అనుమానాలు
- తాజాగా ప్రవాహంలో కొట్టుకుపోయిన యువకుడు

ఆదిలాబాద్, జూన్ 1(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ నుంచి జైనథ్, బేల మండలాల మీదుగా మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. బేల మండలంలోని ఉపాసనాల నుంచి భోరజ్ వద్ద జాతీయ రహదారి–44కు కలిపేలా నేషనల్ హైవే అథారిటీ అధికారులు 353–బీ జాతీయ రహదారిని నిర్మిస్తున్నారు. రూ.194 కోట్లతో 33 కిలోమీటర్ల నిర్మాణంలో భాగంగా రెండు వరుసల రహదారితోపాటు వంతెనల నిర్మాణం కొనసాగుతోంది. ఏడాది కిందట పనులు ప్రారంభం కాగా వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి కావాలి. రోడ్డు నిర్మాణ పనులపై స్థానికులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ముందుగా వంతెనలు నిర్మించిన తర్వాత రోడ్డు పనులు ప్రారంభించాల్సి ఉండగా.. రహదారి పనులు అయిన తర్వాత తర్నం వంతెన నిర్మిస్తున్నారని పేర్కొంటున్నారు. తర్నం పాత వంతెన ఒక పిల్లర్ కుంగినా ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగించేవారని, అధికారులు వర్షాకాలం ముందు బ్రిడ్జిని కూల్చివేసి రాకపోకలు జరగకుండా చేశారని వాహనదారుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రూ. 4.50 కోట్లతో నిర్మించినా ఫలితం శూన్యం

రెండేండ్ల కిందట కురిసిన భారీ వర్షాలతో తర్నం వద్ద వంతెన కుంగిపోయింది. ఈ బ్రిడ్జిపై వాహనాలు ప్రమాదాలకు గురి కాకుండా ముందస్తు జాగ్రత్తలో భాగంగా అధికారులు రాకపోకలు నిషేధించారు. అప్పుడు వాహనాల రాకపోకల కోసం రోడ్డు వంతెన కింది భాగంలో రూ.39 లక్షలతో చిన్న కల్వర్టును నిర్మించారు. గతేడాది వర్షాకాలంలో కురిసిన వర్షాలతో ఈ వంతెన కొట్టుకుపోగా.. ఇటీవల రూ.4.50 కోట్లతో మరో వంతెన నిర్మించారు. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా వంతెనను నిర్మించాల్సి ఉండగా అధికారులు తక్కువ ఎత్తులో పైపులు వేసి నిర్మాణం చేశారు. ఇటీవల కురిసిన వర్షంతో ఈ వంతెన మీదుగా నీరు ప్రవహించి రాకపోకలు నిలిచాయి. నీటి ప్రవాహంలో వంతెన దాటడానికి ప్రయత్నించిన జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్‌కు చెందిన యువకుడు కొట్టుకుపోయాడు. రూ.4.50 కోట్లతో నిర్మించిన వంతెన పనులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారీ వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిపై చిన్నపాటి వర్షాలకే నీరు ప్రవహిస్తుందని, దీంతో జనం ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### కోట్ల రూపాయలు వృథా..

తర్నం వద్ద రూ.4.50 కోట్లతో నిర్మించిన వంతెల వల్ల వాహనదారులకు ప్రయోజనం లేదు. ఇటీవల కురిసిన వర్షానికి బ్రిడ్జిపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఓ యువకుడు గల్లంతయ్యాడు. వర్షం నీరు వల్ల వాహనదారులకు ఇబ్బందులు లేకుండా బ్రిడ్జి కట్టాల్సి ఉండగా అధికారులు నామ మాత్రంగా నిర్మించారు. రోజు వందలాది వాహనాల రాకపోకలు సాగించే జాతీయ రహదారి పనుల విషయంలో అధికారులు ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి.



- రామన్న, కాప్రి, జైనథ్ మండలం

## క్లిక్..క్లిక్..



బోథ్ : గుంటుకతో నేలను చదును చేస్తూ..

# అన్నదాత బిజీబిజీ

- ముందస్తు వర్షాలతో సాగు ముమ్మరం
- దుక్కలు దున్నుతూ.. నేలను చదును చేస్తూ..
- విత్తనాలు విత్తడానికి సిద్ధమవుతున్న రైతులు

*మృగశిర కార్తె దగ్గర పడుతుండడంతో అన్నదాతలు వానకాలం సాగును ముమ్మరం చేశారు. ఈ ఏడాది ముందస్తుగానే వరుణుడు కరుణించడంతో అన్నదాతలు బిజీబిజీ అయ్యారు. నాగళ్లు, ట్రాక్టర్లలో ప్లవ్, కల్టివేటర్‌తో దున్నిస్తున్నారు. గుంటుకల సహాయంతో నేలను చదును చేస్తున్నారు. మిగిలిన చెత్త(తుక్కు)ను కూలీల సాయంతో ఏరి వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ యేడు మద్దతు ధరను పెంచడంతో రైతులు పత్తి సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. పూర్తి స్థాయిలో వర్షాలు అనుకూలిస్తే విత్తనాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. కొందరైతే బోర్లు, బావులు ఉన్న రైతులు పత్తి, కూరగాయల విత్తనాలు నాటడం ప్రారంభించారు.*

*- బైంసా/బోథ్, జూన్ 1*

బైంసా : చేనులో పొరక ఏరుతున్న రైతులు



బోథ్ : పత్తి కట్టెను కాలబెడుతూ..





బోథ్ : ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతూ..

# మూఢనమ్మకం ప్రాణం తీసింది

ఎదులాపురం, జూన్ 1 : ఆదిలాబాద్ పట్టణంలోని బంగారుగూడకు చెందిన ప్రశాంత్–ప్రవళిక దంపతులు మహారాష్ట్రలోని దంద్ర గ్రామం(ప్రశాంత్ అత్తగారిల్లు) లో కొత్తగా ఇల్లు కట్టుకుంటున్నారు. వాస్తు, గృహ ప్రవేశాల అప్పుడు గర్భంతో ఉండడం శుభం కాదని పంతులు సూచించాడు. ఈ మాట మనసులో పెట్టుకున్న ప్రశాంత్ అతడి భార్య ప్రవళికకు గర్భవిచ్ఛిత్తి మాత్రలు ఇచ్చాడు. దీంతో ఆమె క్రమంగా తీవ్ర అనారోగ్యానికి గురి కావడంతో ఆదిలాబాద్ రిమ్స్‌లో చేర్పించారు. రిమ్స్‌లో వైద్యులు తప్పనిసరి పరిస్థితిలో అబార్షన్ చేశారు. మృతశిశువును బయటకు తీశారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రవళిక(23) శనివారం మృతిచెందింది. ఆదిలాబాద్‌లో ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. వీరికి 22 నెలల బాబు కూడా ఉన్నాడు. కాగా.. ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భార్య అకాల మృతికి కారణమైన భర్త ప్రశాంత్ పరారీలో ఉన్నాడు. తల్లి మృతిచెందడం, తండ్రి పరారీలో ఉండడంతో రెండేళ్ల రిషికుమార్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రస్తుతం ఈ బాబు వాళ్ల తాతయ్య వద్ద ఉన్నాడు .



ప్రవళిక (ఫైల్)

# నకిలీ విత్తనాలపై ప్రత్యేక ఆపరేషన్స్

- వారం రోజుల వ్యవధిలో మూడు కేసులు నమోదు, ఐదుగురి అరెస్టు
- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

ఎదులాపురం, జూన్ 1 : ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ విత్తనాలను పూర్తిగా అరికడుతామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. సీసీఎస్ బృందం ఆధ్వర్యంలో పోలీసు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. గతం వారం రోజుల వ్యవధిలో మూడు కేసులను నమోదు చేశామన్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి, ఐదుగురిని అరెస్టు చేశామన్నారు. అలాంటి వారి సమాచారాన్ని డయల్ 100 లేదా 8712659965 నంబర్‌కి అందజేయాలని పేర్కొన్నారు. గతంలో కేసులు నమోదైన వారిపై ప్రత్యేక దృష్టి సారించి, వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేశామన్నారు.

# రజతోత్సవానికి డల్లాస్ ముస్తాబు





బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు హాజరైన బీఆర్ఎస్ నాయకులు

ఖానాపూర్ రూరల్, జూన్ 1 : బీఆర్ఎస్ పార్టీ రజోత్సవ వేడుకలకు అమెరికాలోని డల్లాస్ నగరం వేదికైంది. డల్లాస్‌లో బీఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల విజయవంతమైన ప్రస్తానాన్ని పురస్కరించుకుని అంగరంగ వైభవంగా చేయనున్నారు. ఈ సందర్భంగా అదివారం ఖానాపూర్ మండలంలోని బాదనకుర్తి వాసులు డాక్టర్ బెజ్జంకి హనుమంతురావు ఖానాపూర్ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. అ వేడుకలను విజయవంతం చేయడానికి అమెరికాలోని వివిధ రాష్ట్రలలో ఉన్న తెలుగు వారు డల్లాస్‌కు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై కో–ఆర్డినేటర్ బిగాల మహేశ్, బీఆర్ఎస్ యూఎస్‌ఏ అడ్వైజర్ చైర్మన్ తన్నీరు మహేశ్, రంగినేని అభిలాష్, దిలీప్ పాల్గొన్నారు.

# సేవా పథకాలకు ఎంపిక

ఎదులాపురం, జూన్ 1 : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసులు సేవా పథకాలు అందుకొనున్నారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపా రు. ఉత్తమ సేవా పథకం నర్సయ్య(ఎస్ఐ, పీసీఆర్ ఆదిలాబాద్), సేవా పథకాలు విష్ణు ప్రకాశ్(ఎస్ఐ టూటౌన్ పోలీస్ స్టేషన్), రవీందర్‌రెడ్డి(హెడ్ కానిస్టేబుల్, గుడిహత్నూర్), నాగేశ్వర్(కానిస్టేబుల్, గాదిగూడ), కిషన్(ఏఆర్ కానిస్టేబుల్, ఆదిలాబాద్), రాము(ఏఆర్ కానిస్టేబుల్, ఆదిలాబాద్), గోపాల్(కానిస్టేబుల్, గాదిగూడ) ఉన్నారు.

**నిర్మల్ పోలీసుల ఎంపిక**

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 1:ఉత్తమ పోలీసు పతకాలకు నిర్మల్ జిల్లా పోలీసులు ఎంపికయ్యారు. పోలీసు సేవా పతకానికి తాహిర్‌ఖాన్(హెడ్ కానిస్టేబుల్, సోన్), సాధిక్‌హుస్సేన్(ఎస్సై, నిర్మల్), హనుమాండ్లు(ఏఎస్సై,నిర్మల్),మారుతి(ఏఎస్సై, భైంసా), అబ్దుల్ నహీం(ఏఆర్ఎస్సై, భైంసా), రాథోడ్ భీమ్‌రావు(ఏఎస్సై, దిలావర్‌పూర్), గంగారెడ్డి(హెడ్ కానిస్టేబుల్), కానిస్టేబుళ్లు రామారావు, చిన్నయ్య, భైంసా టౌన్ హెడ్ కానిస్టేబుల్ పెద్ద రాజన్న, తానూర్ కానిస్టేబుల్ సుదర్శన్, లక్ష్మణచాంద కానిస్టేబుల్ సూర్య వెంకటి, నిర్మల్ టౌన్ కానిస్టేబుల్ ముత్యం, కుంటాల కానిస్టేబుల్ షేక్ సాదిక్, ముథోల్ కానిస్టేబుల్ మాణిక్‌రావు, సోన్ కానిస్టేబుల్ శివకుమార్ పతకాలకు ఎంపికయ్యారు.

## వికాసం పాఠశాలలో ప్రవేశాలు

ఉట్నూర్, జూన్ 1 :ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని ఐటీడీఏ ప్రత్యేక అవసరాల వికాసం పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వికాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి 1 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు విద్యార్థులు స్థానిక పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. చెవిటి, మూగ(బదిర), బుద్ధి మాంధ్యత, అందులు, శిశు పాక్షిక పక్షపాతం, స్పీచ్ థెరఫీ, ఉచిత ఆడియో టెస్ట్ చేయడం జరుగుతుందన్నారు. అడ్మిషన్ పొందింన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాం, కాస్మొటిక్స్ చార్జీలు, భోజన, వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో పాఠశాలలో అడ్మిషన్లు పొందాలని సూచించారు. ఇతర వివరాలకు 9440085818ను సంప్రదించాలని కోరారు.

# రాష్ట్ర అవతరణ వేడుకలకు సర్వం సిద్ధం

ఎదులాపురం, జూన్ 1 : తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నది. కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు. ఇందుకు అనుగుణంగానే అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకల్లో భాగంగా ప్రభుత్వ సలహాదారులు ఉదయం 9.35 గంటలకు అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించనున్నారు. 9.40 గంటలకు జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి కలెక్టరేట్‌లో జరిగే వేడుకల్లో పాల్గొంటారు. ఆదివారం ఈ ఏర్పాట్లను ఆర్డీవో వినోద్ కుమార్, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

### నిర్మల్ జిల్లాలో..

నిర్మల్ అర్బన్, జూన్ 1 : నిర్మల్ కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే రాష్ట్ర అవతరణ వేడుకలకు రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్ పర్సన్ రాజయ్య హాజరవుతున్నారని, పట్టణవాసులు, అధికారులు హాజరుకావాలని తెలిపారు.

# పెరిగిన మద్దతు

## నిర్మల్ జిల్లాలో అత్యధికంగా పత్తి, సోయా, వరి సాగు

- పెరిగిన ధరలతో రైతులకు మేలు
- పెరగనున్న పత్తి, సోయా విస్తీర్ణం



### మద్దతు ధరలు..

| రకం | ధర(క్వింటాలు) |
|---|---|
| ధాన్యం(సాధారణ) | రూ.2,369 |
| ధాన్యం 'ఏ' గ్రేడ్ | రూ.2,389 |
| పత్తి | రూ.8,110 |
| జొన్న | రూ.3,699 |
| పచ్చ జొన్న | రూ.3,749 |
| సజ్జలు | రూ.2,775 |
| రాగులు | రూ.4,886 |
| మక్క | రూ.2,400 |
| కందులు | రూ.8,000 |
| పెసలు | రూ.8,768 |
| మినుములు | రూ.7,800 |
| వేరుశనగ | రూ.7,263 |
| పొద్దు తిరుగుడు | రూ.7,721 |
| సోయాబిన్ | రూ.5,328 |
| కుసుమలు | రూ.9,846 |
| అవిసెలు | రూ.9,537 |

నిర్మల్, జూన్ 1(నమస్తే తెలంగాణ) : ఎట్టకేలకు అన్నదాతపై కేంద్రం కనికరించింది. వచ్చే వానకాలం సీజన్ నుంచి రైతులు పండించే పంటలకు మద్దతు ధరను ప్రకటించింది. తాజాగా నిర్వహించిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీలో 2025–26 సంవత్సరానికి కనీస మద్దతు ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నది. దీంతో ఆరుతడి పంటలతోపాటు నూనె గింజలను సాగు చేసే రైతులకు అధిక ప్రయోజనం చేకూరనున్నది. అత్యధికంగా నువ్వులు క్వింటాలుకు రూ.820, రాగులు రూ.596, పత్తి క్వింటాలుకు రూ.589 మేర మద్దతు ధర పెంచింది. అలాగే వరికి రూ.69, జొన్న పంటకు రూ.328, సజ్జలు రూ.150, మక్క రూ.175, కందులు రూ.450, పెసర రూ.86, మినుములు రూ.400, వేరుశనగ రూ.480, పొద్దు తిరుగుడు రూ. 441, సోయాబిన్ రూ.436, కుసుమలు రూ.579, అవిసలు క్వింటాలుకు రూ.820 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించింది. ఎప్పటి మాదిరిగానే ఈ సారి కూడా జిల్లా వ్యాప్తంగా 1.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే పత్తికి మద్దతు ధర పెంచడంతో ఈసారి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు ఉన్నాయి.

### వరికి స్వల్పంగా మద్దతు

జిల్లాలో సాగు నీటి వనరులు పుష్కలంగా ఉండటం, బోరుబావులు అధికంగా ఉండడంతో వరి పెద్ద ఎత్తున సాగవుతుంది. యేటా యాసంగిలో 1.10 లక్షల ఎకరాలు, వానకాలంలో 1.35 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. అయితే ఇంత పెద్ద ఎత్తున సాగయ్యే వరిపంటకు క్వింటాలుకు కేవలం రూ.69 మాత్రమే పెంచడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్వింటాలుకు రూ.100 నుంచి 200 వరకు మద్దతు ధర పెంచితే బాగుండేదని రైతులు అభిప్రాయ పడుతున్నారు.

